# సంకల్పం

అర్ధరాత్రి పూట. కటకటకటమని చెరుకు గిరుక చప్పుడు. అది యమలోకపు గంటల చప్పుడు లాగా వినిపించింది. కలువరిస్తూ నిద్రలేచింది వసంత. మొద్దు నిద్ర. భూమి మురుక చూసిందంటే గుర్రుకొట్టుడే! పైగా పొద్దంతపని. ఎప్పుడుపోయి మంచంలో వాలుదామా అన్నంత అలసట. అంత అలసటలోనూ నిద్రలేదిప్పుడు.

చింపుల బొంత కప్పుకుని బయటకు వచ్చింది వసంత. నిండుగా ఎన్నీల. చెట్ల కైనీడలు గాలికి కదులుతున్నాయి. సూరు కైనీడల కింద బజారు కుక్కలు ములుసుకపన్నయి. గురుజు మీద గుడ్లగూబ గుగ్గూగుప్ మంటుంది. ఇంటి ముందున్న చింతచెట్టు మీద చిమ్మెట్లరొద. బొందలగడ్డకు నక్కలు ఊలలు పెడుతున్నయి. కొప్పులగుట్టకు నెమళ్ళు మ్యావ్ మంటున్నయి. ఇన్ని శబ్దాల నడుమ చెరుకు గిరుక చప్పుడు చెవుల ముందే మోగినట్టు కటకటమంటుంది.

సూరు కింద అరుగు మీద కూసుంది వసంత. మనసు, ఆలోచన, బాధ, భయం అన్నీ ఆ చప్పుడు చుట్టే తిరుగుతున్నాయి. ఇప్పల్ల రెండెకరాల చెరుకుతోట. ఊరికి రెండుమైళ్ళ దూరం. కట్టెను కొట్టి ఫ్యాక్టరీకి అమ్ముదామని వసంత. కాదు బెల్లం వండుదామని పెద్దులు. ఎవడు పెట్టుకున్న పెంట.

బెల్లం వండుడంటే వట్టిగైతదా..... ముద్దల ముద్దగావాలని వసంత. చేసి చెడాలె. కట్టపడితే ఫలితముంటదని పెద్దులు. ఏం కట్టం పాడైంది గట్టుకు రాళ్ళు మోసినట్టని వసంత. చేసిన రెక్కలు శాగవారుతయి. చెయ్యని రెక్కలు చెదలు వడుతయని పెద్దులు.

ఎవల పట్టు వాళ్ళది. ఒకల మాట ఒకలు ఒప్పుకోలేదు. వద్దు వద్దంటే వండుడు వండుడే అన్నడు. అలిగి అవ్వగారింటికి పోయింది వసంత. పెద్దులు మనసు మాత్రం మారలేదు. చెరుకురసాన్ని పిండే గిరుకను కిరాయికి తెచ్చిండు. దానితోబాటే కడాయిలు, దోని సాంచాలు, కట్టెతెడ్లు తెచ్చిండు. పొయ్యిలు తవ్వి దోసులు పాతిండు. కైకిలి మనుషల పెట్టి చెరుకును నరికి కట్టలు కట్టిండు.

తల్లిగారింటికి పోయినా వసంత మనసు ఇంటిమీదనే ఉంది. ఇక్కడ ఏం జరుగుతుందో తెలుసుకుంటనే ఉంది. భర్త మనసు మార్చుకోడని తెలిసినంక తనమనసునే మార్చుకుంది వసంత.

'అలుగుడు పాడుగాను. ఏం అలుగుడు పాడైంది. నా ఎత్తు కొడుకున్నడు. ఇక్కడ ఎన్ని రోజులుంట. ఏమన్నగాని. లాసో లాభమో పట్టుకుని మిడుకాలె. అప్పయితే ఆయన్నే అడుగుతరు. నాకేంది..........?' అని సర్దిచెప్పుకుని పొద్దుగూకే ముందే ఇంటికి వచ్చింది వసంత.

వస్తూనే అన్నం వండి కొడుకుతో సద్ది పంపింది. సద్ది ఇచ్చి ఇంటికి తిరిగి వచ్చిన కొడుకు 'బాపుకు బెల్లం వండస్తలేదు. మొత్తం జీర్కబెల్లమే! ముద్దలు కారుతున్నయి' అన్నడు. అప్పటి నుంచి వసంతకు నిద్ర లేదు. 'బెల్లం వండరానోడు ఎందుకు ఈ పని. మొదలుపెట్టే! పెట్టిండనుకో.....కనీసం ఎవలన్నా తెలిసినోళ్ళను అడుగాలె గదా! నాలుగురోజులు కైకిలి ఇచ్చి అయినా వంటకాన్ని పెట్టుకోవాలె గదా! ఎట్లా..... చెప్పితే వినడు. ఈయనకు తెలువది...' తనలో తాను తొక్కుకుంటుంది వసంత.

ఎక్కడో సంటిపిల్ల ఏడుపు. కుక్కసోకం. జడల దయ్యాల్లా ఊగుతున్న చెట్లు. కరెంటు పోయింది. టక్కుమని గిరుక చప్పుడు ఆగింది. నిశబ్దంలోంచి గాలి కదిలిన చప్పుడు వినిపిస్తుంది కరెంటు వచ్చిన రెండు క్షణాలకు మళ్ళీ టకటక చప్పుడు. గుండె కొట్టుకుంటున్న శబ్దంతో కలిసి వినిపిస్తుంది.

బయట కూర్చుంటే ఎన్నెన్నో యాదికొస్తున్నయి వసంతకు. భర్త ఏనాడూ సంసారం విషయం ఆలోచించలేదు. పొత్తులో ఉన్ననాడు అసలు వేరుకుండనే

వద్దన్నాడు. ఇద్దరు చెల్లెండ్లు ఇద్దరు తమ్ముండ్ల పెండ్లి చేశాడు. ఎవరికి వాళ్ళు ఎదిగిపోయారు. జీవితంలో స్థిరపడిపోయారు. వద్దు వద్దన్నా ఇల్లును అప్పులను నెత్తినెత్తుకున్నాడు. తమ్ములిద్దరికీ అడిగినంత డబ్బు ఇచ్చి చేను చెలుకా నెత్తినెత్తికున్నాడు.

ఏదో కష్టపడి పొట్టకు తుట్టిలేకుండా ఉప్పుకు ఉప్పును అద్దుకతిన్నట్టు బతుకుతుంటే ఎప్పుడొక నష్టాన్ని నెత్తినెత్తుకుంటాడు. కుంట కింద పొలంల మల్లెతోట పెడుదామంటే వినలేదు. పంట పండే భూమిల మల్లెతోట పెట్టద్దని మొక్కజొన్న వేసిండు. చుట్టూ మల్లెతోటలే! చుక్కల్ని ఇసిరి చల్లినట్టు మల్లెపూలే! మధ్యలో ఒక్కటే బెదురు వెట్టినట్టు మక్కచేను. కాకులు చిలుకలు కలిసి చీరుకతిన్నయి. ఒక్కకంకి చేతుకురాలేదు. మల్లెతోటలు పెట్టినోళ్ళు ముల్లెలు గట్టుకుంటే మక్కపెరదు పెట్టి బొక్కబోర్ల పడ్డట్టయింది.

ఒకసారి ఇంతే! రెండెకరాలు ఒక్కటేసారి కోతకొచ్చింది. మిషిని తోటి వరిని కోపిద్దామంటే వద్దంటడు. పొట్ట చేతపట్టుకుని లంబడోళ్లు వచ్చిండ్రు. మనతోటి వాళ్ళు బతుకాలెనంటడు. ఒక వైపు ఉరుముడు మెరుసుడు. వాననో వరదనో తెలువది. అయినా పట్టు విడువడు. ఇప్పుడూ ఇంతే! చెరుకును అమ్ముకుంటే చేతినిండాపైస. అయినా వినడు.

ఇక ఆలోచించలేక ఇంట్లోకి వచ్చింది వసంత. వండనైతే వండిందిగానీ తను మాత్రం తినలేదు. ఆకలితో పేగులు గుర్రుమంటున్నయి. తలుపులు దగ్గరేసి టైంచూసింది. పన్నెండు దాటింది. వెళ్ళి మంచంలో వాలింది. గిరుక చప్పుడు అట్లాగే వినిపిస్తుంది.

"ఏం మనిషి. ఇంతరాత్రయినా పని ఆపలేదు. అసలే మిషిని పని. నిద్రమత్తులో ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా కాలోచెయ్యో ఖతం. అక్కడ వెలుతురుండేటట్టు లైటుపెట్టుకున్నడా లేదా? పొద్దంతా నీడ కోసం గుడిసెనైనా వేసుకున్నాడా లేదా? ఒక్కడే కట్టెమోసుడు కట్టెపిండుడు బెల్లం వండుడు ఎట్ల చేస్తుండు....? ఎవలనన్నా కైకిలి పెట్టుకున్నాడా లేదా........? ఎంత కైకిలి పెట్టుకున్నా ఇంత రాత్రి దాకా ఎవలు ఉంటరు. ఈ పోరన్ని అక్కడనే ఉండుమనాలె. కట్టెకో పొట్టుకో ఆ సరైతడు....." వసంతకు ప్రాణం గుంజుతుంది. అంత కోపంలోనూ జాలి కలుగుతుంది. మనసు తల్లడమల్లడ మయితుంది.

మళ్ళీ లేచి కూసుంది వసంత. కొడుకును లేపి చెరుకు దగ్గరికి పంపాలనుకుంది. అంతలోకే భయం. ఇంత రాత్రిపూట పసిపోరన్ని ఎట్ల పంపాలెననుకుంది. ఇంకోసారి తను పోవాలనుకుంది. అంతలోనే ఆడమనిషిని. మెడల నల్లపూసలున్నయి ఎట్లపోవాలె అనుకుంది. అంతలోనే వైరాగ్యం! ఏమన్న పాడుగాని చెప్పితే వినవోన్ని చెడిపోంగ చూడాలె. నేను ఎంత కొట్టుకుంటే ఏమస్తది! అనుకుంది.

అట్లనే మంచం మీద ఒరిగి కండ్లు మూసుకుంది వసంత. ఊర్లె బెల్లం వంటకాళ్ళు ఎవలెవలున్నారు. ఎవలెవలు బెల్లం వండింద్రు. చెరుకుపంట గురించి ఎవరికి తెలుసునన్న విషయం గురించి ఆలోచిస్తుంది. పొద్దున్నే వాళ్ళను కలువాలనుకుంది.

ఏ రాత్రికో నిద్ర పట్టింది. కూరుకురాత్రికే మెలకువ వచ్చింది. ఎప్పుడు ఆగిందో ఎప్పుడు మొదలయిందో కానీ నిద్రలేచేసరికి టకటక చప్పుడు వినిపిస్తనే ఉంది.

ముందుగా పాలు పిండి చాయ చేసింది వసంత. కేతిరిలో పోసి కొడుకును లేపింది. చాయను ఇచ్చిరమ్మని చెరుకు దగ్గరకు పంపింది. ఇల్లు వాకిలి పని ముగించుకుంది. రాత్రి అనుకున్న పేర్లను గుర్తుచేసుకుంది. బలబల తెల్లారుతుండంగ సాకలింద్ల వైపు నడిచింది.

"ఇప్పుడు బెల్లం వండితే శెనిగెలు బుక్కి చెయ్యి కడిగినట్టే. అసలు బెల్లంకు ధరనే లేదు. ఎవలన్నా వండుతున్నరా.... రొక్కం చేతుల పెట్టి కట్టెను ఫ్యాక్టరోడు కొండవోతుంటే వద్దని బెల్లం వండుడేంది. వండుతెనన్నా లాభముంటదా అంటే అదీలేదు." మొఖం ముందటనే అన్నడు ఎంకయ్య.

"ఉలువలికినోడు ఊకుండక పత్తి అలికి పని పెట్టిండట. మొగనికి బెల్లం తినబుద్ధయితందేమో! పనిలపని సారబట్టీ పెట్టుమను. తాను సచ్చే మందు తాగుతాడే వసంతా! మొదటి నుంచి ఇదే మెడ బలిమి తనమాయె" ఎంకవ్వ అన్నది ఎక్కిరిస్తూ, వరుసకు వదినైతది.

వసంత గుండెల రాయిపడ్డట్టయింది. భయాన్ని కప్పిపుచ్చుకుని పైకి మాత్రం నవ్వింది. ఆ మాట ఈ మాటతో అన్ని జాగ్రత్తలూ చెప్పారిద్దరూ.

"చెరుకు వాడిపోవాలె. ఇటు కొట్టంగనే అటు గిరుకమీదికి ఎక్కియ్యద్దు. మొగులు మెత్తపడ్డా... వర్షం పడ్డా రెండు మూడు రోజులు ఆపెయ్యాలె. కట్టె

నిమ్మకచ్చి పాలు పలుసనైతయి. బెల్లం బంకసాగి జీర్కవారిందనుకో.... వెంటనే రెండు దోసిల్ల బూడిదీ చల్లాలె" చెప్పిండు వెంకయ్య.

"ఇగో మరుదలా... కొత్తగా బెల్లం వండుడంటే కొత్తకుండల ఈగ జొచ్చినట్టు. ఏంలేదు. కడాయి కడాయికి చెంబెడు పెండనీళ్ళు చిలుకరిచ్చినవనుకో.... బెల్లం రాయిలెక్క దిగుతది. ఇక రంగంటవా....? రంగు మంచిగుంటేనే రేటస్తది. కండ్లు మూసుకుని పిడికెడు సున్నం చల్లినవనుకో.... బెల్లం తెల్లగైతది" ఎంకవ్వ చెప్పింది.

ఇద్దరి మాటలు విని ఇంటికి నడిచింది వసంత.

"ఇగో... చెల్లే... నశివ నారాయణ. మడుగుల దిగి లోతుకు బయపడద్దు. ఎట్లాగో మొదలు పెట్టింర్రు. అగంగాకుంర్రి. సూరుడు మనవందునుంటే చుక్కలు కుక్కలైతయన్నట్టు కిస్మత్ మంచిగుంటే నల్లబెల్లమే బంగారమైతది. బెంగటిల్లద్దు" వెళ్తుంటే కేకేసి పిలిచి చెప్పిండు ఎంకయ్య.

"ఏం కిస్మతయ్యా. ... గాల్లె దీపం పెట్టి దేవుడని మొక్కితె నిలుత్తదా... బెల్లం వండి చేతులు గాల్చుకున్నోళ్ళు చెరుకు అమ్మి చేన్లు కొనుక్కున్నరు. సూసుకుంట సూసుకుంట సుడిగుండంల దిగితే సుట్టుకపోక యాడాగుతది.

ఇంకా ఏదో వదిరేదే ఎంకవ్వ. ఎంకయ్య గుడ్లను ఎర్రగ జేసిండు. ఎంకవ్వ నోరు మూసింది.

ఇల్లు చేరిన వసంత అన్నం కూరగిన్నెలు ముల్లెగట్టుకుని గంపల పెట్టుకుంది. కొడుక్కు సద్దిగట్టి బడికి పంపింది. తనూ బుక్కెడు సల్లవడి గంపనెత్తుకుంది.

చెరకు దగ్గరికి పోతుంటే కాలు దుగుతలేదు. అలాగని మనుసు నిలుస్తలేదు. రాత్రిపూట ఊరు ఊరంతా మారుమోగిన గిరుక చప్పుడు ఇప్పుడు మందగించింది.

క్రషరు దగ్గరైతుంటే దాని చప్పుడులాగే గుండె వేగం కూడా పెరుగుతుంది. నిలువెత్తు పచ్చిగడ్డి మీద బర్లు బర్రినట్టు కొంత నరికీ కొంత నరుకని చెరుకుతోట వసంత భయాన్ని మరింత పెంచింది.

కడాయి కింద చెరుకుపొట్టు మండుతుంది. పాలు సల్లపెల్ల మసులు తున్నయి. క్రషర్‌లోంచి సలికడాయిలోనికి అక్కడినుంచి బెల్లం కడాయిలోనికి పాలు రావడానికి పైపులున్నాయి. సలికడాయి ఎత్తుమీదుండి పాలు సగం వరకు అందులోనే మసులుతున్నాయి. ఇటు మంటవేడి అటు పాలచుక్కలు

ఎక్కడా వృథా పోవడం లేదు. ఆ అమరిక చూసినంక ముచ్చటేసింది వసంతకు. ఏదో కొత్త నైపుణ్యం..... కొత్త పనితనం కనిపించిందామెకు.

దోనిలోని బెల్లాన్ని చెక్కతెడ్డుతో కలుపుతున్న పెద్దులు క్షణంఆగి భార్యవైపు చూసి నవ్వాడు. అలసటగా వున్న భర్త కళ్ళల్లో లాలన కనిపించింది వసంతకు. కోపం భయం అన్నీ మరిచి మల్లెపువ్వులా నవ్వింది. గంప దించబోతే చెయ్యి వేసాడు. పక్కనే ఉన్న కానుగాకును తెంపి తెడ్డును మర్రేసి పువ్వు బెల్లం రాసి ఇచ్చాడు. అందుకుని నాకింది వసంత. నోరు నోరంతా తీపి. గుబులు భయం లేదిప్పుడు. ఏదో మాయా వలయంలోకి అడుగుపెట్టినట్టుగా వుంది.

గుడిసెలోకి తొంగి చూసింది. కొన్ని ముద్దలు ఆరలేదు. కొద్ది కొద్దిగా కారుతున్నాయి. కళ్ళల్లో దిగులు కమ్ముకుంది. ఆమెలోని దిగులును పసిగట్టి నవ్వాడు పెద్దులు.

"జీర్క బెల్లం. రెండు కడాయిలు ఖరాబయినయి. వండినయి నాలుగు. వచ్చినయి రెండే..... ఈ కడాయి ఏమైతదో...." ఎంత దాచుకుందామన్నా దాగని భయం పెద్దులు మాటల్లో కనిపించింది.

"ఏం కాదు నేనున్నగదా! ఎట్ల దించుతనో చూడు. అగ్గి.... అగ్గి నిపుక లెక్కుండాలె బెల్లం....." కొంగు నడుముకు చుట్టింది వసంత. ఒక క్షణం పాటు తనకు తానే ఆశ్చర్యపడింది వసంత. తనకు ఈ పనే ఇష్టంలేదు. అలిగిపోయింది. ఇక్కడికి కోపంగా వచ్చింది. ఇప్పుడు తనే ధైర్యం చెప్పుడేంటీ? అనుకుంది.

సరిగ్గా ఇదే ఆలోచన పెద్దులుకు వచ్చినట్టుంది. విచిత్రంగా మొహం పెట్టి భార్య వైపు చూశాడు. సమాధానం దొరుకని ఎన్నో ప్రశ్నలు. ఆమె చూపులు కాదు. నవ్వు కాదు. ఆ పొగ, వాసన, సల్లపెల్ల మసులుతున్న పాల ఆవిర్లు... ఇవన్నీ కలగలిపిన కాపుదనపు రివాయే సమాధానం చెబుతుంది.

నీటిలోంచి ఆవిర్లు పుట్టినట్టు ప్రశ్నలు సుడులు తిరుగుతున్న మనసులోంచి.... ప్రశ్నలోంచే బదులు పుడుతుంది.

"నాకు తెలుసులే...... మునిగిపోతున్నప్పుడు అది ఆపదని, ఆదుకుని గడ్డకు వెయ్యదని తెలిసినా మనం గడ్డిపరకను అందుకుంటాం. బయట పడలేమని తెలిసినా చివరిక్షణం వరకు ఈదుతూనే ఉంటాం. నీకు తెలుసు. ఈ బెల్లం వల్ల నష్టపోతామని. కానీ ఏదో తండ్లాడుతున్నావు" నవ్వుతూ అన్నాడు పెద్దులు.

"నాకే కాదు. నీకూ తెలుసు. మనం బెల్లం వల్ల నష్టపోతామని.... ఎందుకో ఈ తండ్లాట మరి" నిష్ఠూరంగా అన్నది వసంత.

పెద్దులు నవ్వుతూ సద్దిని చేత బట్టుకున్నాడు. కరెంటు బాయి దగ్గరికి నడుస్తూ "పచ్చని చెట్టుంటే పది మంది ఆశపడతారు. ఒకడు చల్లని నీడకు వస్తాడు. ఒకడు ఆకులు పువ్వులు అందుకుంటాడు. ఇంకొకడు కాయను పండును తింటాడు.

ఊర్లె కాపుదనపు కొడుకు ఉన్నడంటే సబ్బండ వర్ణాలు ఆశపడుతాయి. చెరుకును గొట్టి ఫ్యాక్టరీకి అమ్ముకుంటే నీకు లాభమే కానీ... ఊరికేం లాభం. అదే బెల్లం కడాయి పెట్టుకుంటే కోమటోళ్ళు సత్తిముద్దలకస్తరు. దెబ్బతగిలి నోళ్ళు ఉడుకుపాలకస్తరు. పొల్లగాండ్లు నిమ్మచెక్క అల్లంముక్క పట్టుకుని పాలు తాగుడుకస్తరు. కొందరు మలీదముద్దలు పువ్వు బెల్లమంటరు. పోషమ్మకు ఎల్లమ్మకు బెల్లం బువ్వ వండనీకి రెండు పిడుకల బెల్లం గావాలని ఇంకొంత మంది వస్తరు...

"పాలు పాలు ఆపు" మధ్యలోనే అన్నది వసంత కోపంగా."

"అడిగినట్టు ఇస్తే కడిగినట్టు పోతయట. నువ్వేం దాన కంకునం గట్టుకున్నవా....? ఆ దుకాణం పెట్టుకంటే ఒడువది. ఊరుకు ఊరు తోటమీద ఇరుసుక పడతరు"

పెద్దులు మారు మాట్లాడలేదు. సద్ది తీసుకుని నడిచాడు. వసంత కడాయి కింద పొట్టు వేస్తూ కూచుంది. పెద్దులు అన్నట్టుగానే పాలకొరకు, బెల్లం కొరకు గుంపులుగా వస్తున్నారు. వాళ్ళను తరిమి కొట్టింది వసంత. కడాయి దగ్గరికే రానియ్యలేదు.

పాలు వేడై పలుగుతున్నయి. తెడ్డుతో మైల పొంగు తీసింది. ముత్యాల పొంగు వచ్చి పాలు నల్లబడి చిటపట బుగ్గలు లెవ్వగానే తన వెంట తెచ్చిన సున్నంతో నీళ్ళు కలిపి చల్లింది. కాసేపాగి పెండనీళ్ళు. గట్టిపడడానికి బూడిద. అప్పటికప్పుడు బెల్లంరంగే వేరయింది. తెడ్డుతో కొద్దిగా ఆసుకం తీసి నీళ్ళల్లవేసింది. బెల్లం తెల్లగా చెక్కరిగడ్డలా మారింది.

అప్పుడే అన్నం తిని వచ్చాడు పెద్దులు. మెరుస్తున్న కళ్ళతో నీళ్ళలోంచి గోళిలా చేసిన బెల్లంను చూపిస్తూ "ఇట్లా వండాలె బెల్లంను. తెల్లగా ఉన్నంక ధర ఎందుకు పెట్టరు" అన్నది వసంత.

పెద్దులు మొఖం ఒక్కసారిగా ఉగ్రంగా మారిపోయింది. సున్నం, పెండ కలపిన కుండల వైపు బూడిదకంచుడు వైపు కోపంగా చూసాడు.

"ఛీ.....ఛీ... తినేకూట్లే ఇసం బోసినావు కదనే! బెల్లమంటే ఏంటి దనుకున్నవు? ఇదొక చెట్ల మందే! దెబ్బలేత్తే బెల్లం నీళ్ళు పోత్తరు. యాడాది కొకనాడు ఉగాది పచ్చడిల కలుపుక తాగుతరు. కొందరైతే పోలెలు చేసుకుంటరు. చాయల కలుపుకుంటరు. దేవునికి ఎక్కిస్తరు. పీరీలకు సమ్మక్క సారక్కలకు సదివిచ్చి తింటరు. పట్నంల కొన్ని ఫ్యాక్టరీలల్ల పని మనుషులకిస్తరట. వాళ్ళు తినే తిండిల చేజేతులా ఇసం గలిపినవు....."

చిర్రెత్తుకచ్చింది వసంతకు. భర్తవైపు కోపంగా చూసింది. పెద్దులు మాత్రం ఏ మాత్రం తగ్గకుండా "చూడూ.... ఈ నడుమంత్రపు వేశాలు నాకు తెలువక కాదు. దేవుడు మనుషలను పుట్టిస్తే ఆ మనుషలకు తిండిని పుట్టిస్తున్నా. చూస్తూ చూస్తూ వాళ్ళను చంపుకోలేను. ఇందులో ఏదీ కలుపను ఎట్లయినా రానీ...." అన్నడు.

వసంతకు తల తిరిగిపోయింది. ఇంకేదో ఎదురు చెప్పేదే! కైకిలి మనుషులు రావడంతో ఆగిపోయింది. కోపాన్నంత మనసులోనే అనుచుకుంది.

బెల్లం కడాయి దిగింది. సాంచాలు ఆరినయి. బెల్లం గోధుమరంగులో మెరుస్తుంది. ఇంతవరకు ఏ కడాయి అంత నాణ్యతగా దిగలేదు. మొత్తానికి మొత్తం అలా దిగితే రెండింతల లాభం ఖాయం. కానీ వాటి మీద దృష్టి ఆనడం లేదు పెద్దులుకు. ముద్దలన్నింటినీ గుడిసెలో దూరంగా ఉంచాడు.

అతడు చేస్తున్న పనులేవీ అర్థం కావడంలేదు వసంతకు. అయినా తమాయించుకుని పనిలో మునిగిపోయింది. క్రషర్‌లో కట్టెలు పెడుతూ పాలను పిండుతుంది. కైకిలోళ్ళు తోటలో వంగి చెరుకు నరుకుతున్నారు. కొందరు కట్టెసాపు చేసి మోపుల్ని తెస్తున్నారు. ఇంకో కడాయి దిగే ముందు పరుగు పరుగునవచ్చి పెండ, సున్నం కుండల్ని అందుకుంది. అది గమనించిన పెద్దులు వాటిని లాక్కుని విసిరికొట్టాడు.

"మనం బతుకుదాం.... ఇంకొకల్ని బతుకనిద్దాం. సున్నం కడుపుల పేగుల్ని వడివెడుతది. బూడిద తూట్లు పొడుస్తది. పెండ లేని రోగాలను తెస్తది. నాలుగు పైసలకు ఆసపడి అంత కక్కుర్తి పని చేద్దామా?" అన్నాడు కోపంగా.

వసంతకు ఆవేశం ఆగలేదు. నెత్తంతా కొట్టుకుంది. బూరెంటికలు పీక్కుంది. గాయికెత్తుకుంది. నోరు పెద్దది చేసింది. అరవడం మొదలుపెట్టింది.

కైకిలోల్లు నిలబడి చూస్తున్నారు. గిరుక ఆగిపోయింది. పొయ్యిమీది జనం ఆగిపోయారు. ఒకరిద్దరు చొరవగా కడాయి వద్దకు వచ్చి మందలిస్తున్నారు.

పెద్దులు మాత్రం వద్దేవద్దంటున్నాడు. అయితే ఇక్కడ ఉండనే ఉండ నంటుంది వసంత.

"పీకితే పీకు...... బెదిరిస్తున్నావా....? అయ్యిపోతే అమాసాగుతదా?" అన్నాడు పెద్దులు అసహ్యంగా.

చేతుల తెడ్డును నాలెకు కొట్టింది. ఇంటిదారి పట్టింది వసంత. "వీనిల్లు మునుగ..... వీని పట్టుల మన్నువడ..... సంసారముంచడు. బొగ్గులలుకుతడు. వాని బెల్లంల మన్నువడ. ఆ జీర్కు బెల్లాన్ని ఎవలుకొంటరు..... మొత్తానికి మొత్తం బొందమీద పెట్టుకుంటడు...." వదురుతుంది వసంత. ఇంటికి వచ్చి సోకం బెట్టుకుని ఏడ్చింది. చుట్టూ ఉన్నవాళ్ళు మనిషికోతీరు సముదాయించి పోయారు.

ఎత, కత చెప్పుకుందామని ఎంకవ్వ దగ్గరికి పోయింది వసంత. చెప్పిందంతా విన్నంక "పిచ్చిదానా... అన్న పిచ్చోడేంగాదు. నల్లబెల్లం దొరుకనుందా.....? లంబడోళ్ళకు తెలిసిందనుకో.... కండ్లకద్దుకుని తీసుకపోతరు. పైసలంటావా...? రెండింతలస్తయి. కాకపోతే జనాల కంట్లెపడకుంటా దాయాలె" అన్నది ఎంకవ్వ.

దిగులుగా అర్థం కానట్టు చూసింది వసంత.

నవ్వుతూ "నువ్వేమో లాసులాసని ఆగమైతున్నవు. పెద్దులన్న పెద్ద గుమ్మి నింపుతననుకుంటుండు. ముందుగ చెప్పితే ఊరంతా టాంటాం జేస్తవని చెప్పుతలేడు. గీ తండాలకే అమ్ముతడు సూడు" అన్నది ఎంకవ్వ.

వసంతకు మొదట నమ్మబుద్ధి కాలేదు. తర్వాత ఒకలిద్దరు అదేమాట అనడంతో కొద్ది కొద్దిగ నమ్మకం ఏర్పడింది. బెల్లమైతేగాని.... అయిన అమ్మకపోతే నేను అమ్ముత. పైసరాంగ వద్దంటడా... అనుకుంది.

అటో ఇటో బెల్లం వండుడు పూర్తయింది. ముద్దల్ని ఎడ్ల బండి మీద ఇంటికి తెచ్చాడు పెద్దులు. బెల్లం ముద్దల మీద ఈగ వాలితే ముద్ద ఈగ రెండూ కలిసిపోయినట్టుగా నల్లగా ఉంది బెల్లం. ఇంటికి వచ్చిచూసింది ఎంకవ్వ. బెల్లంను చూసి ఒక మురుసుడుగాదు. ఈ బెల్లంతో నీ ఇల్లు బంగారమే అన్నది.

అన్నట్టుగానే ఈ ముచ్చట నాలుగుతండాలకు చెప్పింది ఎంకవ్వ. తెల్లారేసరికి ఇద్దరు ముగ్గురు లంబడోళ్ళు ఇంటి ముందు దిగారు. అప్పుడు

పెద్దులు ఇంట్లో లేడు. బెల్లం బ్యారం మాట్లాడింది వసంత. జోకులెక్కన కాకుండా ముద్దకు ఇంతని బ్యారం కుదిరింది. లెక్కంతా చూసినంక వసంతకు మనసు నిమ్మలమయింది.

"ఇప్పుడైనా నాలుగు కొత్తలు చేతికత్తయి. ఎట్లయినా ఒప్పియ్యాలె. ఒప్పుకోకపోతే కొట్లాటపెట్టుకునైనా సరే! బెల్లం వాళ్ళకే అమ్మాలె' అనుకుంది వసంత.

అప్పుడే వాకిట్లో వ్యాన్ చప్పుడైంది. పెద్దులు ఇంకో ఇద్దరు ముగ్గురు వ్యాన్‌లోంచి దిగారు. చెప్పాచెయ్యకుండానే బెల్లం ముద్దలను వ్యాన్‌లోకి ఎక్కిస్తున్నారు. వారు ఏం చేస్తున్నారో ఎందుకు చేస్తున్నారో తెలియడం లేదు వసంతకు. భర్తను పక్కకు పిలిచి అడిగింది వసంత.

"పెద్దూరు దగ్గర సమ్మక్క సారక్క జాతరుంది. అక్కడ బెల్లం మస్తు కొంటరట. తీసుకుపోతున్న" అన్నాడు పెద్దులు.

సాటుకు పిలిచి లంబడోళ్ళు కొనుక్కపోతరన్న సంగతి చెప్పింది వసంత.

"ఓ పిచ్చిముండా.... వాడు సారా తయారు చేస్తడు. సంసారాలు కూలుస్తడు. ఆ కలకల మనకే తలుగుతది. మనం కడుపు నింపుకోవడానికి ఇంకొకరి కడుపు కాల్చాలెనా" అన్నాడు.

వసంత మొత్తుకుంటుంది. తిడుతుంది. ఆపాలని ప్రయత్నం చేస్తుంది. అప్పులను గుర్తు చేస్తుంది.

అయినా పెద్దులు వినలేదు. రెండు గంటల్లో బెల్లం ముద్దల్ని వ్యాన్‌లో నింపుకుని వెళ్ళిపోయాడు. కొడుకును ముందట పెట్టుకుని ఏడుస్తూ కూర్చుంది వసంత.

పెద్దులు రెండు రోజుల వరకూ ఇంటి మొఖం చూడలేదు. మూడవనాడు వచ్చిండు. వసంత మాట్లాడలేదు. మౌనంగానే వుండిపోయింది. పెద్దులు పండ్లూ పూలు చేతులో పెట్టాడు. వాటితోపాటు రూపాయల కట్ట చేతిలో పెడుతూ ఒక మాట చెప్పాడు.

"కట్టెను ఫ్యాక్టరీకి కొట్టినప్పుడు ఎంత వస్తుండెనో... దొంగ సారాకు అమ్మినప్పుడు ఎంత వస్తుండెనో... ఇప్పుడు ఎంత వచ్చిందో లెక్కచూసుకో..." అంటూ గడపదాటాడు.

ఆసక్తిగా నోట్ల లెక్కచూసుకుంది వసంత. అంతకంటే రెండు వెయిలు ఎక్కువే ఉన్నయి. కష్టమంతా మరిచిపోయింది. భర్తను తప్పుపట్టినందుకు తనను తాను తిట్టుకుంది. బువ్వ కూర వండి భర్త కొరకు ఎదురుచూస్తూ కూర్చుంది.

పెద్దులు కూరుకు రాత్రి దాకా రాలేదు. వస్తవస్తనే జీబును వెంటబెట్టుకుని వచ్చాడు. భయం భయంగా వాకిట్లకు వచ్చింది వసంత. జీబులోంచి భర్త ఐదు కోడిపిల్లల బుట్టలు దించారు.

'పనేం లేదని కోళ్ళఫారం పెడదామనుకుంటున్నాను. ఏదైనా చేసి చెడాలె గదా' అంటున్నాడు.

వసంత గుండె దడదడలాడింది. "వచ్చేది ఎండాకాలం. నోరు తెరిత్తే నోరెడు ఎండ. కోళ్ళకు లేని లేని రోగాలు. బుద్ధి ఉన్నోడు ఎవడు ఎండాకాలంల కోళ్ళ ఫారాలు పెట్టడు. కోళ్ళను సాదుడంటే వట్టిగైతదా... కోళ్ళ ఫారాలు పెట్టినోళ్ళు నెత్తికి బురుద రాసుకున్నరు..." వదురుతుంది వసంత.

పెద్దులు వినడం లేదు. కోడిపిల్లల బుట్టలను జాగ్రత్తగా సర్దుతున్నాడు.

● ప్రజాతంత్ర - **15-21 ఆగష్టు, 2004** ●